క్లుప్తంగా

నేడు శ్రీకాలభైరవాష్టమి

కడప కల్చరల్ : కడప నగర శివార్లలోని శ్రీ ఇష్ట కామ్యార్థ కాలభైరవస్వామికి ఆదివారం ఉదయం 8.00 గంటలకు కాలాష్టమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించనున్నారు. బాసట స్వచ్ఛంద సేవా సంస్థ దత్తత తీసుకున్న మగ్దూం సాహెబ్ కొట్టాల గ్రామంలోని ఈ ఆలయంలో అర్చకులు శ్రీధర్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహిస్తారు.

ఉచిత శిక్షణ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని సంజీవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు టైలరింగ్, బ్లౌజ్ డిజైనింగ్, జ్యూట్ బ్యాగ్స్, మగ్గం వర్క్, ఎంఎస్ ఆఫీస్, బ్యూటీషియన్ వంటి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గల మహిళలు ఈ నెల 13 లోపల సంప్రదించాలన్నారు.. మరిన్ని వివరాలకు 9396161936 అనే నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: గ్రామ పంచాయితీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో గ్రామ పంచాయితీ కార్మికుల సమస్యలపై సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కిరణ్, శివ, వెంకటేష్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు అభినందన సమావేశం

కడప రూరల్ : కడపలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదివారం ఉదయం 10.00 గంటలకు ఏపీ ఎన్జీఓల రాష్ట్ర నూతన కార్యవర్గ ఆత్మీయ అభినందన సత్కార సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.శ్రీనివాసులు, బి.రవికుమార్‌లు తెలిపారు. అంతకుముందు ఇరిగేషన్ కార్యాలయం వద్ద నుంచి కోటిరెడ్డిసర్కిల్, సంధ్య సర్కిల్ మీదుగా వైఎస్సార్ జిల్లా పరిషత్ మీటింగ్‌హాలుకు ర్యాలీ ఉంటుందన్నారు. ఈ ర్యాలీ, అభినందన సత్కారానికి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి తదితరులు హాజరవుతారన్నారు. జిల్లాలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పాల్గొని అభినందన సత్కార సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.


15, 16 తేదీల్లో ఆధ్యాత్మిక సభలు

కడప కల్చరల్ : కడప నగర శివార్లలోని దండు గ్రామ సమీపాన ఈనెల 15, 16 తేదీలలో యేసయ్య ఆశీర్వాద ప్రార్థనల పేరుతో ఆధ్యాత్మిక సభలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బ్రదర్ సురేష్, సంజీవయ్య, మోసెస్, ఓబులేశులు తెలిపారు. ఈ సభల్లో డాక్టర్ బి.సుధీర్ దైవ సందేశాన్ని అందజేస్తారన్నారు. రెండురోజులపాటు సాయంత్రం 6.30 గంటల నుంచి జరిగే కార్యక్రమాల్లో విశ్వాసులు పాల్గొనాలన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఈ నెల 14న నిర్వహిస్తున్న రాయలసీమ ట్రేడ్ యూనియన్ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని రాయలసీమ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సిద్ద రామయ్య పేర్కొన్నారు. శనివారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. ఈ సమస్యలపై జిల్లా మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు బాల చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దదర్గాలో ప్రార్థనలు



పెద్దదర్గా దర్శనానికి వచ్చిన హరీష్, రవికుమార్, ఆనంద్‌శుభాష్

కడప కల్చరల్ : కడప అమీన్ పీర్ (పెద్ద) దర్గాను సినీ యూనిట్ బృందం దర్శించుకుంది. శనివారం వర్ధమాన సినీ హీరో హరీష్, దర్శకుడు రవికుమార్, సినీ సంగీత దర్శకుడు ఆనంద్‌శుభాష్‌లు దర్గా దర్శనానికి వచ్చారు. తొలుత వీరు దర్గాలోని ప్రధాన గురువులైన హజరత్ పీరుల్లామాలిక్ మజార్‌ను దర్శించుకున్నారు. అనంతరం దర్గా ఆవరణలోని ఇతర గురువుల మజార్లను దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దర్గా ముజావర్ వీరికి గురువుల విశిష్ట, చరిత్రలను తెలియజేశారు. వారు మాట్లాడుతూ తమకు సంబంధించి ఇప్పటికే బైలంపుడి, ట్రూ సినిమాలు విడుదలయ్యాయని, మహాలింగాపురంతోపాటు మరో సినిమా నిర్మాణంలో ఉందన్నారు. తమను ప్రేక్షకులు ఆదరించాలని కోరారు.

నేడు శివలింగ దర్శన శాంతి యాత్ర

ప్రొద్దుటూరు కల్చరల్ : మహా శివరాత్రి సందర్భంగా స్థానిక వైఎంఆర్ కాలనీలోని ఓంశాంతి సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు శివలింగ దర్శన శాంతి యాత్రను నిర్వహిస్తున్నట్లు బ్రహ్మకుమారి హేమ ఒక ప్రకటనలో తెలిపారు.

సిలార్ జీవితం నాటక రంగానికే అంకితం



అన్నదానం చేస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప కల్చరల్ : జిల్లాకు చెందిన సీనియర్ రంగస్థల కళాకారులు వైఎస్ సిలార్ జిల్లా నాటకరంగం ప్రతిష్టను నిలపడానికే జీవితాన్ని అర్పించి త్యాగ జీవిగా నిలిచారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష కొనియాడారు. సీనియర్ రంగస్థల కళాకారులు, నట దర్శకుడు, రచయిత వైఎస్ సిలార్ తొలి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుమారుడు సాయిబాబా నగరంలోని ఆదరణ తదితర శరణాలయాల్లో అన్నదానం నిర్వహించారు. డిప్యూటీ సీఎం ముఖ్య అతిథిగా హాజరై సిలార్ నాటక రంగానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో తోట కృష్ణ, సుబ్బారెడ్డి, సిలార్ మిత్రులు పాల్గొన్నారు.

సిలార్ పేరిట అవార్డు నెలకొల్పాలి

వైఎస్ సిలార్ స్మారకంగా యేటా ప్రదానం చేసేలా అవార్డును నెలకొల్పాలని ఢిల్లీ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూలు కరస్పాండెంట్ ఎం.వివేకానందరెడ్డి అన్నారు. సిలార్ తొలి వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో శనివారం రాత్రి నిర్వహించిన స్మారక సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రూ.5 వేల నగదును సిలార్ కుమారుడు సాయిబాబాకు అందజేశారు. నాటక సంఘ సమాఖ్య మాజీ అధ్యక్షులు ఎస్.ఎలియాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారానికి సిలార్ నాటకాల ద్వారా ఎంతో కృషి చేశారన్నారు. బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, నగర ప్రముఖులు వీఎస్ అమీర్ బాబు తదితరులు సిలార్ జిల్లా నాటక రంగంలో బలమైన ముద్ర వేశారని కొనియాడారు. ఇంకా కార్యక్రమంలో సిలార్ కుటుంబ సభ్యులు, భరత్, మొగలి నాగరాజు, మాడా బ్రహ్మం, చెంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు ఆదర్శం సిలార్

కడప రూరల్ : నాటకరంగ కళాకారుడు, నంది అవార్డు గ్రహీత సిలార్ కళాకారులకు ఆదర్శప్రాయుడని ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షులు సుంకేసుల బాదుల్లా తెలిపారు. శనివారం వైఎస్ సిలార్ ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక ఆదరణ నిరాశ్రయుల గృహంలో సిలార్ తనయుడు సాయిబాబా ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బాదుల్లా మాట్లాడుతూ సిలార్ నాటకాల ద్వారానే కాకుండా మేకప్ మెన్‌గా ఆయన చేసిన సేవలు మరువలేమన్నారు. కళాకారులు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని నాటకరంగ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు హమీద్, బుఖారి, శివారెడ్డి, నిజాం, రఫీ తదితరులు పాల్గొన్నారు.

సునీల్ కుమార్‌కు దళిత జాతి అండగా ఉంటుంది

కడప కార్పొరేషన్: అడిషనల్ డీజీపీ హోదాలో ఉన్న ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌కు దళితజాతి అండగా ఉంటుందని ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ, జైభీమ్ మాల మహాసేన నాయకులు తెలిపారు. ఎంపీ రఘురామక్రిష్ణరాజు, కేంద్ర ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ వారు డా. బీఆర్ అంబేడ్కర్ కూడలిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సీఆర్‌పీఎస్ అమరావతి, ఏపీ జిల్లా అధ్యక్షుడు వై.శేఖర్, జైభీమ్ మాలమహాసేన అధ్యక్షుడు పి. సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శి చైతల్య మాట్లాడుతూ సీఐడీ చీఫ్‌గా ఉన్న సునీల్ కుమార్ విధి నిర్వహణలో తన బాధ్యతలను నిర్వహించారన్నారు. ఇది మనసులో పెట్టుకున్న రఘురామక్రిష్ణరాజు ఆయనపై హిందూ వ్యతిరేక ముద్ర వేసి కేంద్రప్రభుత్వం ద్వారా ఆయన ఉన్నత స్థితికి వెళ్లకుండా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. అంబేడ్కర్ ఇండియా మిషన్ ద్వారా ఆయన అనేక ఉపాధి, సేవా కార్యక్రమాలు చేస్తున్నారని, అలాంటి వ్యక్తిపై ఇలాంటి చర్యలు సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మహాసేన నాయకులు లావణ్య, శ్యాంసన్, న్యాయవాది జాషువా పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మేధో వికాసం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాజకిశోర్‌బాబు తదితరులు

కడప సెవెన్‌రోడ్స్ : పుస్తకాలు విరివిగా చదవడం ద్వారానే మేధో వికాసం సాధ్యపడుతుందని రిటైర్ కమాండెంట్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత రాజకిశోర్ బాబు అన్నారు. రిటైర్డ్ లెక్చరర్ దివంగత ఇమాం సాహెబ్ రాసిన సూక్తి రత్నావళి పుస్తకాన్ని శనివారం నగరంలోని దూదేకుల భవనంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత పుస్తకాలు చదివే అలవాటు చేసుకోవాలన్నారు. సెల్‌ఫోన్ మాయాజాలంలో పడి పుస్తకాలు విస్మరించడం దుష్పరిణామాలకు దారి తీసే అవకాశం ఉందన్నారు. పిల్లలు పుస్తకాలు చదివే అలవాటు చేసుకుంటే అద్భుతాలు సాధించవచ్చన్నారు. ఉపాధ్యాయుడు సుబాన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఫక్రుద్దీన్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ మస్తాన్, జెడ్పీ రిటైర్డ్ డిప్యూటీ సీఈఓ వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్ : కడప నగరంలోని 30, 32, 37 డివిజన్లలోని ఎన్‌టీఆర్ నగర్, నాగరాజుపేట, బహదూర్ ఖాన్ మసీదు వీధి, సింగన్న వీధి, కటిక వీధి, మేకల వీధి, వైవీ స్ట్రీట్, పెద్ద దర్గా, నకాష్, అల్మాస్‌పేట ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. కార్మికులు కేటాయించిన సమయానికి హాజరుకావాలని, మెయిన్ రోడ్లను శుభ్రం చేయాలన్నారు. గార్బేజ్ పాయింట్లను తొలగించి, రోడ్లు, కాలువల్లో చెత్త వేయకుండా డస్ట్‌బిన్‌లలో మాత్రమే వేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతిరోజూ క్లాప్ వాహనాలు మూడు విడతలుగా చెత్త సేకరణ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్యాంగ్ వర్క్‌తో ఎక్కువ మోతాదులో చెత్తను శుభ్రం చేయవచ్చని, పిచ్చి మొక్కలను తొలగించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌ఓ డా. ప్రశాంత్‌వర్ధన్, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అందరి సహకారంతో ఘనంగా బ్రహ్మోత్సవాలు



పోస్టర్లను విడుదల చేస్తున్న ఆలయ పాలక మండలి సభ్యులు, అధికారులు

రాయచోటిటౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారి బ్రహ్మోత్సవాలు అన్ని శాఖల అధికారులు, భక్తులు, దాతల సహకారంతో ఘనంగా నిర్వహిస్తామని ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డీవీ రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డిలు తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల నిర్వహణపై ఆలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలను తిలకించేందుకు ఇతర రాష్ట్రాల నుంచి తరలి వచ్చే వేలాది భక్తులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. ప్రతి రోజు అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు శంకరయ్య, ఆలయ వేదపండితుడు రాచరాయ యోగిస్వామి తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం గంగమ్మ జాతరకు పటిష్ట ఏర్పాట్లు



జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి, నాయకులు

లక్కిరెడ్డిపల్లి : ఈనెల 21, 22 తేదీలలో జరగనున్న అనంతపురం గంగమ్మ జాతరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, సమష్టి కృషితో జాతరను జయప్రదం చేద్దామని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డితో కలిసి జాతర పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆయన ఆలయ కమిటీకి, అధికారులకు సూచించారు. దాతలు, అన్నిశాఖల అధికారులు, స్వచ్ఛంద సేవాసంఘాల సహకారం, సమన్వయంతో జాతరను విజయవంతం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు సయ్యద్ అమీర్, గంగమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సమరసింహారెడ్డి, ఆలయ ప్రత్యేక అధికారి రవీంద్రరాజు, మాజీ చైర్మన్ ఆనంద్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : పబ్లిక్ పరీక్షల్లో పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి సి.దేవరాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక రాజబాట వీధిలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, తాళ్లమాపురం జిల్లా పరిషత్ హైస్కూళ్లను డీఈఓ సందర్శించారు. తాళ్లమాపురం జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌లో పాల్గొనాలని, పరీక్షల కోసం ప్రణాళిక రూపొందించుకుని సిద్ధం కావాలని పేర్కొన్నారు. 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ పాఠ్యాంశాల ఉపయోగం గురించి డీఈఓ వివరించారు. ట్యాబ్‌లను విద్యార్థులు ఉపయోగిస్తున్నారా లేదా, వాటి వల్ల ప్రయోజనం ఉందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ట్యాబ్‌లలోని పాఠ్యాంశాలను విద్యార్థులు అభ్యసించాలని సూచించారు. ఉపాధ్యాయులు ట్యాబ్‌లలోని పాఠ్యాంశాలను ఎంత శాతం బోధించింది ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. పాఠశాలలో లాంగ్వేజ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం, టీచ్ అట్ రైట్ లెవెల్ కార్యక్రమాలు ఎలా అమలవుతున్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మనబడి నాడు-నేడు పనులు ఎంత వరకు వచ్చాయని ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వై.గోపి నాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సీఆర్పీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

గోపవరం : శివరాత్రి సందర్భంగా ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే మల్లెంకొండేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. జిల్లాతో పాటు నెల్లూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాల నుంచి భక్తులు తరలిరానున్నారు.

వైభవంగా రంగనాథుడి రథోత్సవం



గోవిందనామస్మరణలతో తేరు లాగుతున్న భక్తాదులు



రథంలో కొలువుతీరిన సతీసమేత శ్రీరంగనాథుడు

పులివెందుల టౌన్ : పట్టణంలో శ్రీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం శ్రీదేవి, భూదేవీ సమేత శ్రీరంగనాథస్వామి రథోత్సవ వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. రథోత్సవ వేడుకలను తిలకించేందుకు పట్టణ పరిధిలోని భక్తులతోపాటు వివిధ ప్రాంతాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి కాయ కర్పూరాలు సమర్పించుకున్నారు. స్వామి వారి తేరు(రథం) కింద గుమ్మడికాయలు పెట్టి పూజాద్రవ్యాలు సమర్పించారు. దారి పొడవునా గోవింద నామస్మరణలతో రథాన్ని కదిలించారు. భక్తులకు ప్రసాదాలు, శీతల పానీయాలను పంపిణీ చేశారు. తేరు ప్రారంభానికి ముందు అర్చకులు కృష్ణరాజేష్‌శర్మ విశేష పూజలు జరిపించారు. ఉభయదారులకు అర్చనలు చేశారు. తేరు ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ డాక్టర్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ అభిషేక్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌లకు బ్రహ్మోత్సవ మర్యాదలతో పూజలు నిర్వహించి ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, ఈఓ రమణలు వారిని శాలువతో సత్కరించి ప్రసాదాన్ని అందజేశారు. అలాగే జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్, డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రాజు, ఎస్ఐలు చిరంజీవి, హుసేన్, హాజీవల్లి, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, అంకాలమ్మ ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, వివిధ శాఖల అధికారులతో స్వామి వారికి పూజలు జరిపించి మర్యాద పూర్వకంగా సత్కరించి ప్రసాదాలను ఇచ్చారు. రథోత్సవం స్థానిక పూలంగళ్ల సర్కిల్ నుంచి కొనసాగి శ్రీనివాస హాలు రోడ్డు, ముత్యాల వారి వీధి, గుంత బజార్, బంగారు అంగళ్ల మీదుగా తిరిగి పూల అంగళ్ల సర్కిల్‌కు చేరుకుంది. స్థానిక పూల అంగళ్ల సర్కిల్‌లో తిరుణాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. వివిధ ప్రాంతాలనుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పర్యవేక్షించారు.

జర్నలిస్టు కాలనీ పరిశీలన



జర్నలిస్టు కాలనీలో సమస్యలను తెలుసుకుంటున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్ : కడప నగరం రామాంజనేయపురంలోని జర్నలిస్టుకాలనీ, ఏఆర్ పోలీస్ కాలనీలను డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు పరిశీలించారు. శనివారం ఆయా కాలనీల్లో పర్యటించిన వారు స్థానికంగా ఉన్న మౌళిక వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుకాలనీ, ఏఆర్ పోలీస్‌కాలనీ ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు నిర్మించాలని స్థానిక ప్రజలు వారికి విజ్ఞప్తి చేశారు. కెమెరామెన్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ రెండు కాలనీల మధ్య ఉన్న 40 అడుగుల రోడ్డులో సీసీ రోడ్డు నిర్మిస్తే జగనన్న కాలనీ వాసులకు కూడా అనుకూలంగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కె. సూర్యనారాయణరావు, షఫీ, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, తోటక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటుకుందాం

కడప కల్చరల్ : ఆర్తులను ఆదుకుని మానవత్వాన్ని చాటుకుందామని మానవత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు ఎస్.రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం కడపలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో సంస్థ సమావేశం నిర్వహించారు.

పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెం నుంచి రమణమూర్తి, మల్లిబాబులు అతిథులుగా విచ్చేశారు. రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అతిథులు జంగారెడ్డి గూడెంలో మానవత సంస్థకు అమూల్యమైన సేవలు అందిస్తున్నారన్నారు. సంస్థ నగర అధ్యక్షులు డాక్టర్ సి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డితోపాటు సహ వ్యవస్థాపకులుగా రమణమూర్తి అందించిన సేవలను కొనియాడారు. సెంట్రల్ కమిటీ సభ్యులు రామాంజులరెడ్డి, రాటాల గోపి సంస్థ కార్యకలాపాల గురించి వివరించారు. కెనరా బ్యాంకు రిటైర్డ్ చీఫ్ మేనేజర్ ఎస్.రఘురామిరెడ్డి సంస్థకు రూ.10 వేల విరాళాన్ని అందజేశారు. ప్రత్యేక అతిథి శ్రీకృష్ణ తేజ మాట్లాడారు. సంస్థ ప్రతినిధులు వెంకట సుబ్బయ్య, టైలర్ కృష్ణారెడ్డి, సత్యనారాయణ, నీలవేణి, మస్తానయ్య, చలమారెడ్డి తదితరులు అతిథులను ఘనంగా సత్కరించారు.

రాజీ మార్గం.. రాజ మార్గం



కక్షిదారులతో మాట్లాడుతున్న మెజిస్ట్రేట్ హరిబాబు

కమలాపురం : కేసుల పరిష్కారంలో రాజీ మార్గం.. రాజ మార్గం అని, లోక్ అదాలత్‌లో పైసా ఖర్చు లేకుండా కేసులు సత్వరం పరిష్కరించు కోవచ్చని కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ హరిబాబు తెలిపారు. శనివారం స్థానిక కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఇరువర్గాలు రాజీ ధోరణిలో ఉన్న 592 కేసులు పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. ఇందులో 569 క్రిమినల్, 14 సివిల్, 9 బ్యాంక్ కేసులు పరిష్కారం అయినట్లు వారు తెలిపారు. కక్షిదారులను ఉద్దేశించి మెజిస్ట్రేట్ మాట్లాడుతూ రాజీ ధోరణిలో ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుంటే తర్వాత అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉండదన్నారు. ముఖ్యంగా సమస్యలున్నవారు కక్షిదారులు కక్ష్యలు, కార్పణ్యాలకు వెళ్లకుండా గ్రామ పెద్దల ఎదుట పరిష్కరించు కోవచ్చన్నారు. లేని పక్షంలో పోలీసులు, కోర్టు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నారాయణరెడ్డి, పుష్పరాజు, మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, మహేష్, కోర్టు, పోలీస్ సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధ్వజ శిఖర ప్రతిష్ట మహోత్సవం



మూడింద్లపల్లెలో నిర్మించిన సీతారామాలయం

దువ్వూరు : మండల పరిధిలోని మూడింద్లపల్లె గ్రామంలో సీతారామ ఆలయంలో ధ్వజ శిఖర ప్రతిష్ట మహోత్సవం ఈనెల 12 నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. 15న ఉదయం 10 గంటలకు గ్రామోత్సవం, చండీ హోమం, 16న సీతారామలక్ష్మణ ఆంజనేయ విగ్రహాలకు ప్రాణప్రతిష్ట, అనంతరం సీతారాముల కల్యాణం, మధ్యాహ్నం అన్నదాన ఉంటుందని వారు వివరించారు.